సాక్షి
యాదాద్రి భువనగిరి

శనివారం । 26 । జూలై । 2025



పరిష్కారంలో ముందుంటా..
చేనేత సమస్యల పరిష్కారంలో ఎల్లవేలా ముందుంటానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. - 8లో



బైక్ దొంగల ముఠా అరెస్టు
ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. - 8లో



వానొస్తే బస్టాండ్ చెరువే..
జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం చిన్నపాటి వర్షం కురిసినా జలమయం అవుతుంది. - 9లో

న్యూస్‌రీల్

వ్యాధుల నివారణకు ముందస్తు కార్యాచరణ

సాక్షి,యాదాద్రి : సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క శుక్రవారం హైదరాబాద్ నుంచి అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. జ్వర సర్వే చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులపై వైద్యారోగ్యశాఖను అప్రమత్తం చేసినట్లు మంత్రికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఫోర్జరీకి పాల్పడిన వ్యక్తుల అరెస్ట్

సంస్థాన్ నారాయణపురం: నకిలీ స్టాంప్‌లు సృష్టించి, వైద్యాధికారి సంతకం ఫోర్జరీకి పాల్పడిన వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రానికి చెందిన సందీప్, చిల్లాపురం గ్రామానికి చెందిన మెరుగు శేఖర్ సంస్థాన్‌నారాయణపురంలో కంప్యూటర్ సెంటర్ నిర్వహిస్తున్నారు. వీరిద్దరూ కొంతకాలంగా కల్యాణలక్ష్మి దరఖాస్తులపై వైద్యాధికారి సంతకాలు ఫోర్జరీ చేసి, నకిలీ స్టాంప్‌లు వేస్తున్నారు. అధికారులు దరఖాస్తులను పరిశీలించే క్రమంలో వైద్యాధికారి సంతకం తేడా ఉన్నట్లు గుర్తించారు. వైద్యాధికారి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేయగా సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు తేలింది. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించింది.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను శుక్రవారం కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని వారికి సూచించారు. లబ్ధిదారులకు సహకరించాలని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నవానికి స్వయం సంఘాలనుంచి రుణం ఇప్పించే ప్రయత్నం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాములు నాయక్, హౌసింగ్ ఏఈ రవిచంద్ర, ఎంపీఓ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి అంబోజు శేఖర్ ఉన్నారు.

12 మండలాల్లో మోస్తరు వర్షం

భువనగిరిటౌన్ : జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా రాజాపేటలో 20 మి.మీ వర్షపాతం నమోదైంది.బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని, 30నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

మండలాల వారీగా వర్షపాతం (మి.మీ)
రాజాపేటలో 20 మి.మీ, ఆలేరు 12, బొమ్మలరామారం 10, తుర్కపల్లి 9, మోటకొండూరు 6.8, గుండాల 10.6, యాదగిరిగుట్ట 11.2, చౌటుప్పల్ 13.3, భూదాన్‌పోచంపల్లి 9.4,అడ్డగూడూరు 7.4, మోత్కూరు 8.2, వలిగొండలో 4.8మి.మీ వర్షపాతం నమోదైంది.

నోడల్ పర్సన్లు కీలకం

భువనగిరి: కుష్టు వ్యాధి నిర్మూలనలో నోడల్ పర్సన్ల పాత్ర కీలకమని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్లు రాములు, మాధవి సూచించారు. శుక్రవారం భువనగిరిలోని మలేరియా నివారణ జిల్లా కార్యాలయంలో జరిగిన లెప్రసీ నోడల్ పర్సన్స్ జిల్లాస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. కుష్టువ్యాధి గ్రస్తులను గుర్తించి వారి వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అంతేకాకుండా వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ప్రత్యేక అధికారిగా అనితారామచంద్రన్




నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి పది జిల్లాలకు ఐఏఎస్‌లను ప్రత్యేక అధికారులను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు ప్రత్యేక అధికారిగా ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అండ్ ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్‌ను నియమించింది. ప్రభుత్వం నిర్వహించే వివిధ కార్యక్రమాలకు ప్రత్యేక అధికారిగా వ్యవహరించనున్నారు.

భూసేకరణ గుబులు!

రీజినల్ రింగ్ రోడ్డు పక్కనుంచి రింగ్ రైల్వే లైన్ ప్రతిపాదనలు

- జిల్లా పరిధిలో రెండు స్టేషన్లతో అలైన్‌మెంట్
- ఇప్పుడు సేకరించిన భూమికి అదనంగా అవసరం
- ఇంకా నష్టపోతామని ప్రస్తుత భూ నిర్వాసితుల్లో భయం
- ఇప్పటికీ కొలిక్కిరాని 'రీజినల్' భూముల పరిహారం



చౌటుప్పల్ : హైదరాబాద్ మహానగరంపై ట్రాఫిక్ భారాన్ని తగ్గించడంతోపాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రీజినల్ రింగ్ రోడ్డును ప్రతిపాదించారు. రీజినల్ రింగ్‌రోడ్డును ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించి ప్రక్రియ మొదలుపెట్టారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం వల్ల ఈ ప్రాంత రైతులు కోట్లాది రూపాయల విలువైన భూములు, ప్లాట్లు కోల్పోతున్నారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఎంతమాత్రం సరిపోదని మూడేళ్లుగా బాధితులు పోరాడుతూనే ఉన్నారు. ఇప్పటి వరకు ఈ సమస్యకు ఎలాంటి పరిష్కారం లభించలేదు. ఈ తరుణంలో తాజాగా తెరపైకి వచ్చిన రింగ్ రైలు అంశం వారిలో మరింత గుబులు పుట్టిస్తుంది. రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా రింగ్ రైలును అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి. ఈ ప్రతిపాదనతో ప్రస్తుత భూ నిర్వాసితులు మరింత ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లా పరిధిలో 59.77 కిలో మీటర్లు

రీజినల్ రింగ్‌రోడ్డును 344కి.మీ ప్రతిపాదించారు. దీన్ని ఉత్తరం, దక్షిణ భాగాలుగా విభజించారు. ముందుగా ఉత్తర భాగంలోని 158కిలో మీటర్లకు సంబంధించిన ప్రక్రియను చాలా నెలల క్రితమే ప్రారంభించారు.ఈ భాగంలో యాదాద్రి జిల్లాల పరిధిలో తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాల మీదుగా 59.77 కిలో మీటర్ల మేర రహదారి వెళ్లనుంది. రోడ్డును 100 మీటర్ల వెడల్పుతో నిర్మాణం చేయనున్నారు. ప్రస్తుతం ఆరు వరుసలు, భవిష్యత్‌లో ఎనిమిది వరుసలుగా నిర్మాణం చేయాలని ప్రతిపాదించారు.

కొత్త వ్యక్తులు భూములు కోల్పోయే అవకాశం..

రింగ్‌రైలు ప్రాజెక్టు భూ నిర్వాసితులను మరింత కలవరానికి గురిచేస్తుంది. రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా రైల్వే మార్గం ఏర్పాటు చేయాలంటే ఇప్పుడు సేకరించిన భూమికి అదనంగా మరింత భూమి సేకరించాల్సి ఉంటుంది.అదే జరిగితే ఇప్పుడు గుర్తించిన ప్రాంతాల్లో రోడ్డుకు ఒక్కోవైపు 15–20 మీ టర్ల భూ సేకరణ జరగాలి. అలా మొత్తంగా కేవలం ఉత్తర భాగంలోనే 500–600హెక్టార్ల భూమి అదనంగా సేకరించాల్సి ఉంటుంది. అదే జరిగితే ఇప్పుడు భూములు కోల్పోతున్న వ్యక్తులు మరింత భూమి కోల్పోవాల్సి వస్తుంది. కొత్తగా మరికొంద రు భూములు కోల్పోయే అవకాశాలు ఉన్నాయి.

అదనంగా భూ సేకరణ..

రీజినల్ రింగు రోడ్డుకు జిల్లాలో 59.77 కి.మీ పరిధిలో 692.09 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. రింగ్ రైలు ఏర్పాటు చేయాలన్న తాజా ప్రతిపాదన ప్రకారం మరో 200 హెక్టార్ల భూమిని అదనంగా సేకరించాల్సి ఉంటుందని అంచనా. రైల్వేస్టేషన్లు, జంక్షన్లు, క్రాసింగ్‌లతో కలుపుకుంటే మరింతగా పెరిగే అవకాశం లేకపోలేదు.

40-45 మీటర్లకు ప్రతిపాదనలు

రీజినల్ రింగ్‌రోడ్డుకు సమాంతరంగా రింగ్ రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇదే విషయాన్ని రాష్ట్రం సైతం సమ్మతించింది. అందుకోసం ముందుగా పలు ప్రతిపాదనలు తయారు చేశారు. రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా అదే రోడ్డు వెంట రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని, ట్రిపుల్‌ఆర్‌కు 3–4కిలోమీటర్ల దూరంలో రైల్వే లైన్ ఉండాలని ప్రతిపాదించారు. అయితే పలు రకాల ఆలోచలన తర్వాత రింగ్ రైలును రోడ్డు పక్కనుంచే నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. అయితే ఇప్పుడు జరిగిన 100 మీటర్ల భూసేకరణలో రోడ్డు కోసం 74 మీటర్లు అవసరం అవుతుండగా మిగిలిన 26 మీటర్ల భూమి రింగ్‌రైల్‌కు ఎంతమాత్రం సరి పోని పరిస్థితి నెలకొంది. దాంతో రింగ్ రైల్ కోసం మరింత భూ సేకరణ జరపాల్సిన ఆవశ్యకత నెలకొంది. ఆ ప్రకారంగా మరో 25–30మీటర్ల వరకు భూమిని సేకరిస్తే రింగ్‌రైల్ భూ సమస్య పరిష్కారం అవ్వడంతోపాటు భవిష్యత్‌లోనూ సమస్యలు తలెత్తవు.

రోడ్డున పడేయొద్దు



రీజినల్ రింగ్ రోడ్డు పేరిట ఇప్పటికే నాలుగు ఎకరాలు తీసుకున్నారు. ఇప్పుడు రింగ్ రైలు అంటున్నారు. దీనికోసం మళ్లీ భూములు సేకరించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఇదే జరిగితే ఉన్న భూమిని కోల్పోయి కటుంబమంతా రోడ్డున పడాల్సి వస్తుంది. –ముప్పిడి పాండుగౌడ్, నిర్వాసితుడు, లింగారెడ్డిగూడెం

అలైన్‌మెంట్ మార్చాలి



మొదట ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌ను 12 కి.మీ వెనక్కి తీసుకొచ్చారు. అభివృద్ధికి మేము వ్యతిరేకం కాదు. అయితే గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయకుండా పట్టణాల మీదుగా రోడ్డు, రైలు మార్గం వేయడంతో విధ్వంసం జరుగుతుంది. మొదటగా రూపొందించిన ప్రాంతానికి అలైన్‌మెంట్ మార్చాలి. –గుజ్జుల సురేందర్‌రెడ్డి, భూ నిర్వాసితుడు, చౌటుప్పల్

బలవంతంగా లాక్కుంటామంటే కుదరదు



రీజినల్ రింగ్ రోడ్డు పేరిట భూములను బలవంతంగా లాక్కుంటున్నారు. కోట్ల రూపాయలు పలుకుతున్న భూములకు నామమాత్రపు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారు. మొదటి అలైన్‌మెంట్ ప్రకారం రీజినల్ రింగ్ రోడ్డు, రింగ్ రైలు నిర్మాణం చేయాలి. లేదంటే భూమికి భూమి లేదంటే బహిరంగ మార్కెట్ ధర చెల్లించాలి. బలవంతంగా భూములు లాక్కుంటామంటే కుదురదు. –చింతల దామోదర్‌రెడ్డి, భూనిర్వాసితుల వేదిక కన్వీనర్



కలెక్టరేట్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

భూ భారతిపై స్పెషల్ డ్రైవ్

భూ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో క్యాంపులు

- రెవెన్యూ యంత్రాంగమంతా అక్కడే మకాం
- సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు 15,046
- 844 సమస్యలు పరిష్కారం

సాక్షి, యాదాద్రి : రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం స్పెషల్‌డ్రైవ్ చేపట్టింది. కలెక్టర్ హనుమంతరావు ఆదేశాల మేరకు మూడు రోజులుగా కలెక్టరేట్‌లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందిని కలెక్టరేట్‌కు వచ్చి దరఖాస్తులను పరిశీలించి పరిష్కారం చూపుతున్నారు. జూన్ 3నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 15,048 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 1,785 దరఖాస్తులు పరిష్కరించేవిగా గుర్తించారు. వీటికి ఆగస్టు 15లోగా పరిష్కారం చూపేలా రెవెన్యూ యంత్రాంగం శ్రమిస్తోంది.

జాప్యాన్ని నివారించేందుకే కలెక్టరేట్‌లో..

తహసీల్దార్ కార్యాలయాల్లో రోజువారీ కార్యక్రమాలపై అధికారులు, సిబ్బంది ఎక్కువ దృష్టి సారిస్తుండటంతో దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు. రెవెన్యూ యంత్రాంగమంతా కలెక్టరేట్‌లోనే మకాం వేసి తహసీల్దార్ కార్యాలయాల వారీగా దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. పరిష్కారం చేయగలిగేవి, చేయలేని దరఖాస్తులను వేరు చేశారు.

పరిష్కరిస్తున్న సమస్యలు ఇవీ..

మిస్సింగ్ సర్వే నంబర్లు, పౌతి, మ్యూటేషన్, భూ యజమాని, తండ్రి, భార్య, ఇతరుల పేర్లు, కులం, ఇంటి పేరు, ఆధార్‌లో తప్పులు, డిజిటల్ సైన్ పెండింగ్ దరఖాస్తులను పరిష్కరిస్తున్నారు. మ్యుటేషన్ సంబంధించిన వారసుల్లో ఎవరైనా రాకపోతే వారికి నోటీసులు ఇచ్చి రప్పిస్తున్నారు. దరఖాస్తు పరిష్కరించకపోతే అందుకు కారణాలను దరఖాస్తుదారుడికి లిఖితపూర్వకంగా ఇస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సాదాబైనామాలు, పీఓటీ దరఖాస్తులను పక్కనబెట్టారు. తదుపరి ఆదేశాలు వచ్చిన తరువాతనే వాటిని పరిష్కరిస్తారు.

ఆగస్టు 15లోపు పూర్తి



తహసీల్దార్ కార్యాలయాల్లో వివి ధ కారణాల వల్ల దరఖాస్తుల పరి ష్కారంలో జాప్యం జరుగుతుంది. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో క్యాంపులు ఏర్పాటు చేసి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు కలెక్టరేట్‌లోనూ ఉంటే పర్యవేక్షిస్తున్నారు. ఆగస్టు 15లోపు పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. –కలెక్టర్ హనుమంతరావు

గురువారం రాత్రి వరకు పరిష్కరించిన దరఖాస్తులు

మండలం	దరఖాస్తులు	మండలం	దరఖాస్తులు
		భువనగిరి	46
ఆత్మకూర్	52	మోత్కూరు	43
మోటకొండూరు	38	గుండాల	46
రాజాపేట	33	అడ్డగూడురు	43
ఆలేరు	46	పోచంపల్లి	33
యాదగిరిగుట్ట	47	రామన్నపేట	49
బీబీనగర్	99	చౌటుప్పల్	33
బి.రామారం	70	వలిగొండ	60
తుర్కపల్లి	94	నారాయణపురం	25

శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి

- డీఈఓ సత్యనారాయణ



మాట్లాడుతున్న డీఈఓ సత్యనారాయణ

భూదాన్‌పోచంపల్లి: ప్రయోగాత్మక విద్యతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథకం పెంపొందించాలని డీఈఓ సత్యనారాయణ సూచించారు. భూదాన్‌పోచంపల్లి మండలంలోని జూలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ నిర్వహణపై సైన్స్ ఉపాధ్యాయులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ జిల్లాలో 17 పీఎంశ్రీ పాఠశాలలకు గాను ఒక్కో స్కూల్‌కు రూ.10లక్షల విలువైన పరికరాలు వచ్చాయన్నారు. భౌతికశాస్త్ర పరికరాలను అమర్చే విధానంపై రిసోర్స్ పర్సన్‌లు సంబంధిత ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారని, బోధనలో ప్రయోగాలు చేయడం ద్వారా విద్యార్థులు ప్రత్యక్ష అనుభవం పొంది పోటీ ప్రపంచంలో రాణించడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్, అకడమిక్ మానిటరింగ్ అధికారి జానీ, రిసోర్స్‌పర్సన్లు అఖిల్, శివ, భార్గవ్, వివిధ మండలాల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం నిత్యారాధనలో భాగంగా ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా చేపట్టారు. శ్రావణమాసం మొదటి రోజు కావడంతో అమ్మవారిని పట్టువస్త్రాలు, వజ్రవైఢూర్యాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మండపంలో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం మండపంలోని వేదికపై అమ్మవారిని అధిష్టించిపజేసి ఊంజల్ సేవ నిర్వహించారు. ఇక ప్రధానాలయంలో నిత్యారాధనలు యథావిధిగా కొనసాగాయి. ప్రభాతవేళ సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం సుదర్శన హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం తదితర వేడుకలు నిర్వహించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.



ప్రత్యేక అలంకరణలో ఆండాళ్ అమ్మవారు

గ్రామ పాలనాధికారి పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

భువనగిరిటౌన్ : గ్రామపాలన అధికారుల రెండో స్పెల్ స్క్రీనింగ్ రాత పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. ఈ నెల 27న భువనగిరి పట్టణంలోని వెన్నెల కాలేజీలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షకు 37 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు చేయాలని, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. పరీక్ష సమయంలో జిరాక్స్ షాపులు మూసివేయించాలని, అభ్యర్థులను తనిఖీ చేసి కేంద్రంలోకి పంపాలని స్పష్టం చేశారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు నిర్దేశిత సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలో నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు.



గంధమల్ల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అధికారులు

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

తుర్కపల్లి: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని, వ్యాధులు దరిచేరవని స్వచ్ఛ సర్వేక్షణ రాష్ట్ర అధికారులు వనజబేగం, జుబేదాబేగం పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం తుర్కపల్లి, గంధమల్ల, మల్కాపురం గ్రామాల్లో పర్యటించారు.పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు పారిశుద్ధ్యం, వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఓ ఎర్ర నారాయణ, పంచాయతీ కార్యదర్శి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

- ఏడాదిగా కేంద్రాలు మూత, పునఃప్రారంభించడంలో జాప్యం
- కొత్త కార్డు తీసుకోవాలన్నా, మార్పులు చేయించుకోవాలన్నా ఇబ్బందులు
- వ్యయప్రయాసలకోర్చి పట్టణాలకు పరుగు
- కొత్తవి తెరవాలని జనం డిమాండ్

ఆధార్ కేంద్రాలు ఐదే..

సాంకేతిక సమస్యలు, ఇతర కారణాలతో 12 సెంటర్ల ఐడీ సస్పెన్షన్



గతంలో ఆధార్ కేంద్రం కొనసాగిన ఆలేరులోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు

ఆలేరు: జిల్లాలో అవసరం మేరకు ఆధార్ కేంద్రాలు లేకపోవడం ప్రజలకు ఇబ్బందిగా మారింది. ఆధార్‌కార్డులో చేర్పులు, మార్పులు, కొత్త కార్డుల కోసం ఉదయం నుంచే కేంద్రాల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. జిల్లాలో 17 మండలాలు ఉన్నాయి. గతంలో అన్ని మండలాల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయగా.. అందులో కొన్నింటి ఐడీలను సాంకేతిక సమస్యలు, ఇతర కారణాల వల్ల సస్పెండ్ చేయడంతో అవి పనిచేయడం లేదు. వాటిస్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో పక్క మండలాలు, పట్టణాలు, పొరుగు జిల్లాకు వెళ్లాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నింటికీ 'ఆధార్'

రైతు భరోసా, రైతుబీమా, కిసాన్ సమ్మాన్, ఆసరా పింఛన్, రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, గ్యాస్ కనెక్షన్, బ్యాంక్ ఖాతా, రుణాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలతో పాటు ప్రైవేట్ కార్యకలాపాలకు ఆధార్ కార్డే కీలకం. ఆధార్‌లో తప్పుల సవరణ, వేలిముద్రలు అప్‌డేట్, అడ్రస్ మార్పు చేసుకోవడం వంటి ప్రక్రియలు నిరంతరం సాగుతున్నాయి. కానీ, తగినన్ని ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో నూతన కార్డులు పొందడం, కార్డుల నవీకరణ, మార్పులకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కారణాలు ఇవీ..

జిల్లాలో ఏర్పాటు చేసిన ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కేంద్రాలు ఏడాది క్రితమే మూతపడ్డాయి. ఆయా కేంద్రాల్లో ఐరిష్, వేలిముద్రలు స్కానింగ్ చేసే సమయంలో ఎర్రర్లు, ఆపరేటర్లు పొరపాటుగా వివరాలు నమోదు చేయడం. సెంటర్లలో 12 ఏళ్ల కిత్రం నాటి లాప్‌ట్యాప్‌లు ఉపయోగించడం, పోర్ట్‌లు సపోర్ట్ చేయక సాంకేతిక తప్పులన్నీ యూఐడీఏఐలో నమోదవుతాయి. ఇలా ఒక నెలలో 30కి మించి తప్పులు జరిగిన ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కేంద్రాల ఐడీలు సస్పెండ్ కావడంతో మూతపడ్డాయి. యూఐడీఏఐ తిరిగి ఐడీ కేటాయిస్తేనే కేంద్రాలు తెరుచుకోనున్నాయి. తిరిగి తెరిపించడంలో యంత్రాంగం చొరవ చూపకపోవడం గమనార్హం.

సేవలకు దూరభారం

ఆలేరులో ఆధార్ సెంటర్లు లేకపోవడం వల్ల ప్రజలు సుమారు 14 కి.మీ దూరంలోని జనగామకు, లేదా 23 కి.మీ.దూరంలోని భువనగిరికి వెళ్తున్నారు. మోత్కూరు నుంచి 50 కి.మీ.దూరంలోని జనగామ, భువనగిరి కేంద్రాలకు పోతున్నారు. అవసరం మేరకు ఆధార్ సెంటర్లు లేకపోవడంతో ప్రజలు గంటల తరబడి కేంద్రాల వద్ద నిరీక్షించాల్సి వస్తుంది. ఉదయం నుంచే కేంద్రాలు జనంతో రద్దీగా మారుతున్నాయి.



భువనగిరిలోని సెంటర్‌లో కిక్కిరిసిన జనం

ఆధార్ కేంద్రాలు లేని మండలాలు

జిల్లాలో 17 మండలాలు ఉన్నాయి. మండలానికి ఒకటి చొప్పున ఆధార్ కేంద్రాలు ఉండాలి. కానీ, వలిగొండ, గుండాల, చౌటుప్పల్, యాదగిరిగుట్ట, భువనగిరి మండలాల్లోనే ఉన్నాయి. ఆలేరు, ఆత్మకూరు(ఎం), భూదాన్ పోచంపల్లి, అడ్డగూడూరు, సంస్థాన్‌నారాయణపురం(2), రాజాపేట, రామన్నపేట, బొమ్మలరామారం, తుర్కపల్లి, మోత్కూరు, బీబీనగర్ మండలాల్లో మూతపడ్డాయి.

జనగామకు వెళ్లాను



ఆధార్ కార్డులో తప్పుల సవరణ కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఐదు రోజుల క్రితం ఆలేరు నుంచి జనగామకు వెళ్లాల్సి వచ్చింది. అన్ని పనులు వదులుకొని వెళ్లాను. అక్కడ చాలాసేపు వేచ్చి ఉండాల్సి వచ్చింది. ఆలేరులో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తే సమయం ఆదా అవుతుంది. –ఎండీ మోసిన్,ఆలేరు

వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు



మండల కేంద్రాల్లో ఆధార్ కేంద్రాలు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆలేరు ప్రజలు జనగాం,భువనగిరికి వెళ్తున్నారు. అంతదూరం పోవాలంటే వృద్ధులు అవస్థలు పడుతున్నారు. అన్ని మండలాల్లోనూ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. –మొరిగాడి వెంకటేష్‌గౌడ్, ఆలేరు

యూఐడీఏఐకి దరఖాస్తు చేశాం



ఐడీల సస్పెండ్ కారణంగా 12 మండలాల్లో ఆధార్ కేంద్రాలు పనిచేయడం లేదు. మిగితా ఐదు మండలాల్లో కొనసాగుతున్నాయి. పనిచేయని కేంద్రాలకు ఐడీలు కేటాయించాలని యూఐడీఏఐకి దరఖాస్తు చేశాం. ఐడీలు రాగానే కేంద్రాలు అందుబాటులోకి వస్తాయి. మోటకొండూరులో కొత్తగా సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. –ఎస్.సాయికుమార్, ఈడీఎం

క్లుప్తంగా

పటిష్ట భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరి క్షేత్రానికి వచ్చే భక్తులకు పటిష్ట భద్రత కల్పించాలని దేవస్థానం సిబ్బంది, ఎస్పీఎఫ్, హోంగార్డు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఈఓ వెంకట్రావ్ సూచించారు. ఆలయ సన్నిధిలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి వచ్చే భక్తులతో పాటు దాతలకు దర్శన సమయంలో, ఆలయ పరిసరాల్లో కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతపై వివరించారు. సమావేశంలో ఆలయ డిప్యూటీ ఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఆలయాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పద్మావతి అమ్మవారికి పంచామృతాభిషేకం



స్వర్ణగిరి క్షేత్రంలో అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో గల వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా పద్మావతి అమ్మవారికి ఉదయం నవ కలశ పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అష్టోత్తర శతనామాలతో విశేష కుంకుమార్చన సేవ జరిపించారు. అంతకు ముందు ఆలయంలో స్వామి వారికి ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నిత్య కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం 3వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం స్వామి వారికి ఆలయ మాడ వీధుల్లో తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

వలిగొండ : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన శుక్రవారం వలిగొండ మండలంలోని ఎం.తుర్కపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. తుర్కపల్లికి చెందిన మర్రి సతీష్ వ్యవసాయం చేస్తుంటాడు. శుక్రవారం తన వ్యవసాయ పొలం వద్ద గల పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అతడిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.



నిండుగా ఉన్న సాగర్ జలాశయం

గతేడాది డెడ్ స్టోరేజీ.. ప్రస్తుతం 579 అడుగుల నీరు

పెద్దవూర(నాగార్జునసాగర్): గతేడాది జూలై 25న నాగార్జునసాగర్ జలాశయం అడుగంటి ఉంది. నీటి మట్టం కనిష్ట స్థాయి(510అడుగులు) కంటే దిగువన 504.20 అడుగులు ఉంది. అప్పుడు డెడ్‌స్టోరేజీలో ఉన్న జలాశయం సరిగ్గా ఈ ఏడాది జూలై 25న శుక్రవారం సాగర్ నీటిమట్టం 579 అడుగులకు చేరింది. కృష్ణానదికి ముందస్తుగా వరదలు రావడంతో జూలైలోనే గరిష్టస్థాయికి చేరువలో ఉంది. గతేడాది ఈ సమయానికి సాగర్‌లో 122 టీఎంసీల నీరు ఉండగా.. ఇప్పుడు 281 టీఎంసీల నీరుంది. అయితే, గతేడాది ఆగస్టు 5న సాగర్ గేట్లు ఎత్తారు. ఈసారి ఇంకా ముందుగానే గేట్లు ఎత్తే అవకాశం ఉంది.

బైక్ దొంగల ముఠా అరెస్టు

- త్రిపురారంలో ఆరుగురు, హాలియాలో ముగ్గురు అరెస్టు
- వారి నుంచి 20 బైక్‌లు, ఏడు సెల్‌ఫోన్లు, రెండు తులాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

హాలియా : బైక్‌లు చోరీ చేస్తున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 25 లక్షల విలువ చేసే 20 బైక్‌లు, రెండు తులాల బంగారం, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ శుక్రవారం హాలియా పోలీస్ సర్కిల్ కార్యాలయంలో వెల్లడించారు. ఏపీలోని పల్నాడు జిల్లా రెంటచింతల మండలం మంచికల్ గ్రామానికి చెందిన దేవనబోయిన శ్రీను, అదే గ్రామానికి చెందిన వేముల నాగరాజు, నల్లగొండ జిల్లాలోని అడవిదేవులపల్లి మండలం బాలెంపల్లి గ్రామానికి చెందిన రమావత్ వంశీ, కుర్ర తుల్సా, నాగార్జునసాగర్‌లోని పైలాన్‌కు చెందిన కొల్లపూడి వంశీ, దామర్లచర్ల మండలంలోని నర్సాపురం గ్రామానికి దీరావత్ వంశీ, నర్సాపురానికి చెందిన మూనోతు కిరణ్, అనుముల మండలంలోని అలీనగర్‌కు చెందిన మహమ్మద్ జానీ, హైదరాబాద్‌లోని తుర్కయంజాల్‌కు చెందిన కణపర్తి ప్రవీణ్‌లు మూడు ముఠాలుగా ఏర్పడ్డారు. బైక్‌లు చోరీ చేసి విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. ఏపీలోని మాచర్ల, గుంటూరు, రెంటచింతల, కారంపూడి, తెలంగాణలోని హైదరాబాద్, నల్లగొండ జిల్లా పరిధిలోని హాలియా, మిర్యాలగూడ, త్రిపురారం, నిడమనూరు, మునగాల, చౌటుప్పల్, ఎర్రగుండ్లపాడు, వాడపల్లి ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, హోటళ్లు, బస్టాండ్ ప్రాంతాలు, వైన్స్‌లు రాత్రి వేళ ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన బైక్‌ల చోరీలకు పాల్పడుతున్నారు. ఈమేరకు వీరిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. శుక్రవారం హాలియా, త్రిపురారం మండలాల పోలీసులు ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహనాలు తనిఖీ చేపట్టారు. త్రిపురారంలో బైక్‌లపై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆరుగురిని, హాలియాలో ముగ్గురిని గుర్తించారు. వీరి వద్ద వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో వారిని పట్టుకుని విచారించారు. బైక్‌లు చోరీ చేస్తున్నట్లు అంగీకరించడంతో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 20 ద్విచక్రవాహనాలు, రెండు తులాల బంగారం, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఏపీ రాష్ట్రానికి చెందిన దేవనబోయిన శ్రీనుపై గతంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ఆరు బైక్ దొంగతనం కేసులు నమోదైనట్లు ఎస్పీ తెలిపారు. పట్టుబడ్డ తొమ్మిది మంది నిందితులపై హాలియా, త్రిపురారం, నిడమనూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేసు నమోదైనట్లు ఎస్పీ పేర్కొన్నారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు పర్యవేక్షణలో కేసును ఛేదించిన హాలియా సీఐ సతీష్‌రెడ్డి, హాలియా, త్రిపురారం ఎస్‌ఐలు సాయి ప్రశాంత్, నరేష్, సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు.

జాతీయ స్థాయి ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు

- ఎంజీయూ యూనివర్సిటీ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



మాట్లాడుతున్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో జాతీయ స్థాయి ప్రమాణాలతో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిని ఉపయోగించుకొని జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఎంజీ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం ఎంజీయూలో స్పోర్ట్స్ బోర్డు వార్షిక సమావేశానికి హాజరై మాట్లాడారు. ఎంజీ యూనివర్సిటీలో రాబోయే రోజుల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల నిర్వహణ అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కళాశాల క్రీడా పోటీల నిర్వహణ, క్రీడాంశాల ఆమోదం, కోచింగ్ క్యాంపుల నిర్వహణ, కొత్త క్రీడాంశాలను ప్రవేశపెట్టడం, అంతర్ కళాశాలలు, అంతర్ యూనివర్సిటీల క్రీడా పోటీల్లో విద్యార్థుల ఎంపికలు తదితర వాటిని పరిశీలించి ఆమోదం తెలిపారు. సమావేశంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అలువాల రవి, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ హరీష్‌కుమార్, ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, అధ్యాపకులు మురళి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీదేవి, ప్రేమ్‌సాగర్, మిర్యాల రమేష్, కోఆర్డినేటర్ శివశంకర్, ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్ర సర్కిళ్లలో బోర్డుల ఏర్పాటు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి దిగువన ఉన్న రింగ్ రోడ్డు చుట్టూ గల సర్కిల్స్‌కు ఇటీవల అధికారులు, అర్చకులు నామకరణాలు చేశారు. సర్కిల్స్‌లో నామకరణాలు చేసిన దేవుళ్ల విగ్రహాలను ఏర్పాటు చేయాలని ఈఓ వెంకట్రావ్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో వైకుంఠ ద్వారం వద్ద ఉన్న సర్కిల్‌కు హనుమాన్ సర్కిల్ పేరుతో కూడిన బోర్డు ఏర్పాటు చేశారు. మరిన్ని సర్కిల్స్ వద్ద ఈ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయా సర్కిల్స్‌లో త్వరలో విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు.



వైకుంఠద్వారం సర్కిల్ వద్ద హనుమాన్ సర్కిల్ పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన పోలీసులు

తిప్పర్తి: ఆత్మహత్యకు యత్నించిన మహిళను తిప్పర్తి పోలీసులు కాపాడారు. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం నల్లగొండ పట్టణానికి చెందిన మహిళ తిప్పర్తి మండలంలోని దుప్పలపల్లి గ్రామ సమీపంలో రైలు పట్టాల వెంట అనుమానాస్పదంగా తిరుగుతోంది. స్థానికులు సమాచారం అందించడంతో వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని సదరు మహిళను కాపాడారు. ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చేందుకు సఖి కేంద్రానికి పంపినట్లు ఎస్సై తెలిపారు. పది నిమిషాల్లోనే స్పందించి మహిళను కాపాడిన కానిస్టేబుల్ ప్రేమ్ చందు, వెంకటేశ్వర్లును ఎస్సై అభినందించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

- పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే పరస్పర దాడులు

సంస్థాన్ నారాయణపురం : కుటుంబ కలహాల నేపథ్యంలో సంస్థాన్ నారాయణపురం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఇరువర్గాలు స్టేషన్ ఆవరణలోనే దాడులు చేసుకున్నారు. ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొటిమీదితండాకు చెందిన కరెంటోతు పూలు- సోన దంపతులు. వీరికి నరేష్, రాజేష్ అనే ఇద్దరు కుమారులున్నారు. నరేష్ భార్య తల్లిదండ్రులు అయిన వాంకుడోతు ధర్మా-మోతీలు అదేతండాలో నివాసం ఉంటున్నారు. నరేష్‌కు, అతడి భార్య కుటుంబసభ్యులకు మధ్య మంగళవారం వివాదం నెలకొంది. వారు నరేష్ తల్లిని దూషించారు. దీంతో వారు బుధవారం సంస్థాన్‌నారాయణపురం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. స్టేషన్ ఆవరణలో పెద్దమనుషుల మధ్య మాట్లాడుతుండగా.. వివాదం ముదిరింది. దీంతో ఇరువర్గాల వారు దాడులు చేసుకున్నారు. పోలీస్‌లు వారిని చెదరగొట్టారు. దాడి కారణమైన రాందాసు, లచ్చిరాం, రాజేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్ తెలిపారు.

- ఖిలా.. పాలధారలా..



రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఈక్రమంలో భువనగిరి ఖిలాపై నుంచి వర్షపు నీరు పాలధారలా జాలువారుతోంది. ఈ దృశ్యాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

– భువనగిరిటౌన్

చేనేత సమస్యల పరిష్కారంలో ముందుంటా

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



చేనేత సంఘాల పర్సన్ ఇన్‌చార్జీలు, ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : చేనేతల సమస్యల పరిష్కారం కోసం ముందుంటానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చేనేత సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జీలు, చేనేత ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. చేనేత సంఘాలు, నేతన్నలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. జియో ట్యాగింగ్ ఉన్న మగ్గానికి అనుబంధంగా ముగ్గురు కార్మికులు ఉండేలా చూడాలని కోరారు. గతంలో ముగ్గురికి అవకాశం ఉండగా ప్రస్తుతం ఇద్దరికి కుదించారని తెలిపారు. 300చేనేత సంఘాలకు సంబంధించి రూ.50కోట్ల రుణాలను మాఫీ చేయించి కొత్త రుణాలను మంజూరు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన సందర్భంలో 2009లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిని ఒప్పించి చేనేత రుణాలను మాఫీ చేయించానని గుర్తుచేశారు. చేనేత సంఘాల సమస్యల పరిష్కారంతోనే తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని తెలిపారు. రుణాల మాఫీ, సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం, జియో ట్యాగ్ అనుబంధ కార్మికుల సంఖ్యను ముగ్గురికి పెంచడం వంటి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉమ్మడి జిల్లాతోపాటు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన చేనేత సంఘాల పర్సన్ ఇన్‌చార్జీలు, చేనేత నాయకులు ఉన్నారు.

బస్సు దగ్ధంపై దర్యాప్తు ముమ్మరం



దగ్ధమైన ఆర్టీసీ బస్సు (ఫైల్)

మిర్యాలగూడ, మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలంలోని తడకమళ్ల గ్రామంలో ఈనెల 22న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆర్టీసీ బస్సుకు నిప్పంటించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఆర్టీసీ సీరియస్‌గా తీసుకుంది. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను రంగంలోకి దింపారు. ఈమేరకు వారు దర్యాప్తు ముమ్మరం చేశారు. మద్యం మత్తులో ఎవరైనా నిప్పు పెట్టారా? లేక పథకం ప్రకారం నిప్పు పెట్టారా? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. ఈ ఘటనలో ఎంత మంది ఉన్నారు. ఆ రోజు రాత్రి ఏం జరిగిందనే అంశంపై ఆరా తీస్తున్నారు. అర్ధరాత్రి వరకు ఏయే మద్యం దుకాణాలు తెరిచి ఉంటున్నాయి? పెట్రోల్ ఎవరు తెచ్చారు. ఎవరి వద్ద తీసుకువచ్చారనే కోణంలో వివరాలు సేకరిస్తున్నారు. అంతేకాకుండా ఈ ఘటనలో అసలు సూత్రధారి ఎవరు, ఎవరైనా ప్రోత్సహించారా? వీరి వెనుక ఎవరెవరు ఉన్నారనే దానిపై విచారణ చేస్తున్నారు.

ఆగడాలకు రాజకీయ అండ

తడకమళ్ల గ్రామంలో బస్సు దగ్ధమైన సంఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది. రాజకీయ చైతన్యం కలిగిన ఈ గ్రామంలో చిన్న సమస్యను కూడా గ్రామస్తులందరూ కలిసి పరిష్కరించుకుంటారు. కానీ గ్రామంలోని కొందరు ఆకతాయిల కారణంగా గ్రామానికి మచ్చ తెచ్చిపెట్టారు. బస్సు దగ్ధం ఘటన వెనుక గ్రామంలోని కొందరి ఆకతాయిల పనేనని, వారు గత కొంతకాలంగా గ్రామంలో అనేక గొడవలకు కారణమవుతున్నారని, వీరికి రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని గ్రామస్తుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఆకతాయిల గుంపులోనే ఒకరు కీలకంగా వ్యవహరిస్తూ గొడవలకు పాల్పడుతుంటాడని పేర్కొంటున్నారు. బాలికను వేధించిన కేసులో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వచ్చాడని, దొంగతనాలు, దాడులు, బెదిరింపులకు పాల్పడుతుంటాడని చెబుతున్నారు. బస్సు దగ్ధం కేసులో అతనే కీలక సూత్రధారి అని గ్రామంలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో గ్రామానికి చెందిన 20 మంది యువకులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు సమాచారం. వీరిలో 8 మంది పాత్ర కీలకంగా ఉందని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు తెలిసింది. వారిపై ఇంతకుముందు ఏమైనా కేసులు ఉన్నాయా అనే దానిపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. బస్సు దగ్ధం ఘటన రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే జరిగిందని, రాజకీయ ఆధిపత్యం కోసం గ్రామం నలిగిపోతున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరిన్ని శాఖలతో సుధా బ్యాంకు విస్తరణ

- మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్



మాట్లాడుతున్న మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్

సూర్యాపేట : ఏడు బ్రాంచులుగా ఉన్న సుధా బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరంలో హయత్ నగర్, చౌటుప్పల్‌లో మరో రెండు బ్రాంచ్‌లు కొత్తగా ఏర్పాటు చేయబోతున్నట్లు సుధా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ తెలిపారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని త్రివేణి ఫంక్షన్ హాల్‌లో బ్యాంక్ చైర్మన్ మీలామహదేవ్ అధ్యక్షత నిర్వహించిన సుధాబ్యాంక్ 26వ వార్షిక సర్వసభ సమావేశంలో ఆయన మాట్లాడారు. 26 సంవత్సరాలుగా సుధా బ్యాంక్ లాభాలను వాటాదారులకు డివిడెంట్ రూపంగా పంచుతూ సమాజ పురోగాభివృద్ధికి తమ వంతు బాధ్యత వహిస్తుందని తెలిపారు. రాబోయే సంవత్సరంలో మరో మూడు బ్రాంచులు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరానికి వచ్చిన రూ.కోటి 66 లక్షల లాభాన్ని వివిధ రిజర్వ్‌లకు మళ్లించగా వాటాదారులకు 15శాతం డివిడెంట్ పంచుతున్నట్లు తెలిపారు. మహిళలు తమ సొంత ప్రణాళికలతో బ్యాంకింగ్ సౌకర్యాలను అందిపుచ్చుకొని మరింత అభివృద్ధి చెందాలన్నారు. సమావేశంలో బ్యాంక్ డైరెక్టర్ కక్కిరేణి చంద్రశేఖర్, బ్యాంకు వైస్ చైర్మన్ పానుగోటి నిర్మల, అనంతల ప్రభాకర్, కామ్ లేకర్ శంకర్ లాల్, ఏపూరి శ్రవణ్ కుమార్, మీలా సందీప్ కుమార్, కక్కిరేణి చంద్రశేఖర్, బాణావత్ సుజాత, వెంకటేశ్వర్లు, ఇరుకుళ్ల చెన్నకేశవరావు, వెంపటి వెంకటరమణ పాల్గొన్నారు.

నకిలీ మద్యం కేసులో మరో ఏడుగురు అరెస్ట్



పట్టుబడ్డ నిందితులతోపాటు స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాటిళ్లు

హుజూర్‌నగర్ : మేళ్లచెరువు మండలం రామాపురంలో నకిలీ మద్యం కేసులో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం మరో ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి హుజూర్‌నగర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 22న నమోదైన నకిలీ మద్యం కేసు విచారణలో భాగంగా రామాపురంలో పలు ప్రదేశాల్లో దాడులు చేసి రామాపురం, దొండపాడు గ్రామాలకు చెందిన పలువురిని అదుపులోకి తీసుకొని విచారించారు. రంగిశెట్టి సైదేశ్వర్‌రావు ఇంటి వద్ద 6 కాటన్ల నకిలీ మద్యం, అతని స్నేహితుడైన ప్రవీణ్, నరేష్‌ల వద్ద 30 లీటర్ల స్పిరిట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం వారిచ్చిన సమాచారం మేరకు డీలర్ కొట్టే నర్సింహారావు అతడి బంధువుల పొలంలో పాతి పెట్టిన 50 కాటన్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. అతడికి సహకరించిన నాగ సైదేశ్వర్‌రావు, వీరభద్రం, గురువయ్యలను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో 9 మంది పై కేసు నమోదు చేసి వీరిలో ఏడుగురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఇప్పటి వరకు 16 మందిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వీరిలో ఇప్పటి వరకు 11 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 3 కేసుల్లో కలిపి మొత్తం 870 లీటర్ల స్పిరిట్, 100 కాటన్ల ఎంసీ విస్కీ పేరుతో ఉన్న నకిలీ మద్యం, హీల్స్, లేబుల్స్, కాప్స్‌తో పాటు ట్రాక్టర్, ట్రాలీ, కార్, స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. కేసులో ప్రధాన నిందితుడు తోట శివశంకర్ కోర్టులో లొంగిపోగా అతనిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఇతను మెళ్లచెరువులోని శివ పార్వతి వైన్స్‌లో నౌకర్‌నామాగా పని చేస్తున్నందున ఆషాప్ లైసెన్స్ సస్పెండ్ చేసి షాపును సీజ్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో డీటీఎఫ్ సీఐ స్టీవెన్సన్, ఎస్‌ఐ రామకష్ణ, ఎక్సైజ్ ఎస్‌ఐలు జగన్ మోహన్ రెడ్డి, వెన్నెల, సిబ్బంది రుక్మరెడ్డి, ధనుంజయ్, నరేష్, నాగరాజు, రవి, మధు, నాగయ్య, గోపిరెడ్డి, బాలు, ప్రవీణ్ పాల్గొన్నారు.

పత్తిలో పోషకాల యాజమాన్యం తప్పనిసరి

- కేవీకే సేద్యపు విభాగం శాస్త్రవేత్త చంద్రశేఖర్ సూచనలు







డాక్టర్ చంద్రశేఖర్, కేవీకే శాస్త్రవేత్త

త్రిపురారం : పంట మార్పిడి చేయకుండా పత్తి పంటనే పండించడం వల్ల పంటకు జింకు, మెగ్నీషియం వంటి సూక్ష్మపోషకాల లోపం కనిపిస్తుంది. దీని నివారణకు రైతులు తెగుళ్ల, పోషకాల యాజమాన్య చర్యలు సకాలంలో చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస రావు సూచిస్తున్నారు.

పత్తి పంటకు సోకే తెగుళ్ల లక్షణాలు, నివారణ చర్యలు

జింక్ లోపం

జింక్ లోపం సోకిన పత్తి పంటలో మొక్క ఆకులు పసుపు పచ్చ రంగులోకి మారుతాయి. ఆకులు చిన్నవిగా ముడతలు పడి కణువుల మధ్య దూరం తగ్గుతుంది. మొక్కలు గిడసబారి పోతాయి.

నివారణ చర్యలు : 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటిలో కలిపి ప్రతి ఐదు రోజులకు ఒకసారి రెండు లేదా మూడు సార్లు పిచికారీ చేసుకోవాలి. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను భూమిలో వేసి కలియ దున్నాలి.

మెగ్నీషియం లోపం

మెగ్నీషియం దాతువు లోపంతో ముదురు ఆకుల అంచులు పసుపు రంగుగా మారుతాయి. అరువాత ఆకులు ఎర్రబడి రాలిపోతాయి.

నివారణ చర్యలు : లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున మెగ్నీషియం సల్ఫేట్‌ను కలిపి వారం, పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

పారా నిల్టు లక్షణాలు

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో జిల్లాలో అక్కడక్కడ పత్తి పంటల్లో పారా నిల్టు లక్షణాలు వ్యవసాయ శాస్త్రవేత్తలు గమనించారు. దీని వల్ల మొక్కలకు పోషకాలు సరిగా అందక సడలిపోయి మొక్కలు చనిపోతున్నాయి. దీని ద్వారా మొక్కలు సాంద్రత తగ్గి దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుంది.

నివారణ చర్యలు

అంతర కృషి చేపట్టి మద్దతుగా యూరియా 25 కేజీలు హెక్టారుకు, పొటాష్ 10 కేజీలు హెక్టారుకు పోషకాలను అందించి మొక్కలను కాపాడుకోవాలి. అవసరమైతే పంటల సాగులో వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించాలి.